క్లుప్తంగా

ఆరుతడి పంటలు వేసుకోవాలి



విడవలూరు: వేసవిలో వరి రెండో పంటకు సాగునీటి లభ్యత లేనందున ఆరుతడి పంటలు వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే పంటను వరుసగా రెండు సీజన్‌లలో వేయడం వల్ల చీడపీడల బెడద ఎక్కువగా ఉండి, సాగు ఖర్చు పెరిగి దిగుబడి తక్కువ వస్తుందన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వులు, పెసర, మినుము వంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయశాఖ అధికారి వెంకటకృష్ణయ్య, ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఓ మధురిమ, ఎమ్‌ఏఓ టి.అరుణ, తమీర్, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లెలో రైతుల సౌకర్యార్థం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మార్క్‌ఫెడ్ మేనేజర్ పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌టీజే-4, 5, సీఎస్‌వీ-24 ఎస్ఎస్ రకాల జొన్న రకాలు సాగు చేసిన రైతుల నుంచి క్వింటా రూ.3,180లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఒక్కో రైతు నుంచి ఐదెకరాల పంటను కొనుగోలు చేస్తామన్నారు. మార్క్‌ఫెడ్, జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ సహాయ మేనేజర్ సుధాకర్‌రావు, మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వేణు, ఏఓ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విశేష పూజలు

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో బుధవారం రామాలయం పునర్నిర్మాణానికి వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. కాలనీలో పదిహేనేళ్ల క్రితం రామాలయం నిర్మాణం చేపట్టారు. అయితే అనివార్య కారణాలతో నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. తిరిగి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కాలనీవాసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వేదపండితులతో పునర్నిర్మాణ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

• ఆర్‌ఓ, ఆర్డీఓ కె.మధులత

ఆత్మకూరు: ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల కమిషన్, కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు.. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది ఏ పార్టీల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ విషయం ఎన్నికల తేదీ ప్రకటన వెలువడక ముందే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు సమాచారం తెలియజేశామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో పలువురు ఉద్యోగులు నిబంధనలు అతిక్రమించిన క్రమంలో సస్పెండ్ చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సిబ్బందికి ఇప్పటికే తొలి విడత శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 70 ఏళ్లు పైబడిన వారి ఓట్లు ఇళ్ల వద్దే పోల్ చేసేలా ఈసీ ఆదేశాల మేరకు ప్రత్యేక సిబ్బందితో సంబంధిత ఫారంలో నమోదు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో జరుగుతున్న ఖర్చును ఆయా పార్టీల ఖాతాల్లో నమోదు చేస్తున్నట్లు ఇందుకు సంబంధించి వీడియో సైతం తీయిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి ఎన్నికల ప్రచార ఖర్చును ఆయా అభ్యర్థుల ఖాతాల్లో నమోదు చేయనున్నట్లు అభ్యర్థులు గమనించాలన్నారు. ఈ విషయమై రాజకీయ నాయకులతో గతంలోనే జరిగిన సమావేశంలో తెలియజేశామన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం

జలదంకి: మండలంలోని కృష్ణాపాడులో బుధవారం మూడు వరి గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కొలగాని పెదమస్తాన్, కొలగాని చినమస్తాన్, కేశవరం పురుషోత్తం పశుగ్రాసం నిమిత్తం ఏర్పాటు చేసుకున్న మూడు గడ్డివాములు దగ్ధం కావడంతో దాదాపు రూ.80 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి పరిశీలించారు. బాధితులకు సహాయం అందిస్తానని తెలిపారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డా.మీర్జా షంషేర్ అలీబేగ్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు వచ్చిన ఆయన ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన, తదితర పథకాల కింద మైనార్టీ విద్యార్థులకు ఉపకారవేతనాలను అందజేస్తోందని తెలిపారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, పీజీ విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున ఏడాదికి అందజేస్తోందని వివరించారు. జిల్లాలో జగనన్న విద్యాదీవెన కింద 2019-20లో 5,532 మందికి రూ.13.76 కోట్లు, 2020-21లో 6,137 మందికి రూ. 11.16 కోట్లు, 2021-22లో 5,383 మందికి రూ.15.06 కోట్లు, 2022-23లో 5,814 మందికి రూ.11.40 కోట్లు ఉపకారవేతనాలు అందజేసినట్లు తెలిపారు. జగనన్న వసతి దీవెన కింద 2019-20లో 5,764 మందికి రూ.5.57 కోట్లు, 2020-21లో 6,193 మందికి రూ.5.98 కోట్లు, 2021-22లో 6,449 మందికి



విలేకరులతో మాట్లాడుతున్న మీర్జా షంషేర్‌అలీబేగ్

రూ.6.25 కోట్లు, 2022-23లో 5,772 మందికి రూ.5.59 కోట్లు అందజేసినట్లు వివరించారు. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద 9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న మైనార్టీ విద్యార్థులకు ఏడాదికి రూ.5వేలు వంతున అందజేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరులోని ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 480 మంది మైనార్టీ బాలురకు విద్యా, వసతి,భోజన, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అక్కచెరువుపాడు వద్ద నూతన భవన నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఇందుకు ఇప్పటి వరకు రూ.900 లక్షలు వెచ్చించామని, మిగిలిన పనులకు రూ.600 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఇప్పటికే 12 షాదీఖానాలను నిర్మించామని తెలిపారు. వెంకటాచలం, ముత్తుకూరు, ఉలవపాడు, తదితర ప్రాంతాల్లో షాదీఖానాల నిర్మాణానికి రూ.5.38 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చిల నిర్మాణాలు, మరమ్మతులు, ప్రహరీల నిర్మాణానికి రూ.3 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. క్రైస్తవ హాస్పిటల్స్‌కు రూ.10లక్షలు, అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, క్రైస్తవ కమ్యూనిటీ హాల్స్‌కు రూ.5లక్షల వంతున ఆర్థిక సాయం అందజేస్తోందని చెప్పారు. శ్మశానవాటికలు, ప్రహరీల నిర్మాణాలకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.3 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.5 లక్షలు అందజేస్తోందని తెలిపారు. 493 మంది పాస్టర్లకు ప్రతి నెలా రూ.5 వేలు చొప్పున గౌరవవేతనాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తోందని తెలిపారు. మైనార్టీల సంక్షేమాభివృద్ధికి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చైతన్యం



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి వాణి

నెల్లూరు సిటీ: చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాజాన్ని చైతన్యపరచడమే తమ లక్ష్యమని సీనియర్ సివిల్ జడ్జి కే వాణి పేర్కొన్నారు. బాలబాలికలకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన చైతన్య ర్యాలీని జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి సీ యామిని ఆధ్వర్యంలో ఈ నెల 11 వరకు ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం కింద బాలలందరికీ న్యాయం అనే అంశంపై చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మానవ అక్రమ రవాణా, చట్ట విరుద్ధమైన వస్తువుల కొనుగోలు, బాలలతో వెట్టిచాకిరీ, తదితర చట్టవిరుద్ధమైన అంశాలపై సమాజాన్ని చైతన్యపరచడమే తమ లక్ష్యమని వివరించారు. వివక్షతకు గురవుతున్న బాలబాలికలకు సంబంధించిన సమస్యలపై జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదిస్తే తగిన న్యాయం చేస్తామన్నారు. ఈ ర్యాలీలో యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ టీం ఏఎస్సై సతీష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్ రాంబాబు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వరరావు, లేబర్ అధికారులు వెంకటేశ్వరరావు, అనిల్, మహిళా సంక్షేమ శాఖకు సంబంధించి డీసీపీఓ సురేష్, సుమతి పాల్గొన్నారు.

దళితులను కించపరిచేలా వీపీఆర్ ప్రసంగం

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రచారంలో భాగంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేసిన ప్రసంగం దళితులను కించపరిచే విధంగా ఉందని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధికార ప్రతినిధి మల్లి నిర్మల తెలిపారు. మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేమిరెడ్డి కుటుంబానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఉన్నత పదవులు కల్పిస్తే వారు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. టీడీపీలోని సీనియర్ నేతలపై నమ్మకం లేదని ప్రశాంతిరెడ్డి చెప్పడం వాస్తవమా..కాదా తెలియజేయాలన్నారు. కొందరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని, వారు నారాయణ, వేమిరెడ్డి



మాట్లాడుతున్న మల్లి నిర్మల

ఇళ్లలో పాలేరులుగా చేరారేమోనని అనుమానం కలుగుతుందన్నారు. గతంలో జిల్లాలో షాడో మంత్రిగా వ్యవహరించి నేడు టీడీపీలో చేరిన ఆయన కనీసం ఆ పార్టీ కార్యాలయంలో కూడా విలేకరుల సమావేశం పెట్టలేని దుస్థితిలో ఉన్నారన్నారు.

ఘనంగా హోమియో దినోత్సవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హోమియో దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ 235వ జయంతిని పురస్కరించుకుని స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ శ్రీనివాసకుమార్ పాల్గొని హోమియో వైద్యం విశిష్టతను వివరించారు. తొలుత సీనియర్ హోమియో డాక్టర్ సత్యనాథ్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రామారావు, గుర్రం సురేంద్రబాబు, కోశాధికారి అరిగెలసాయి, మాజీ అధ్యక్షుడు వేలూరి రంగారావు, కిలారి తిరుపతి



మాట్లాడుతున్న శేషగిరిరావు

నాయుడు, రఘురామ్ ముదిరాజ్, బాసం శేషగిరిరావు, బాదం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ, నెలూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఖలీల్‌అహ్మద్‌కు మద్దతుగా నగరంలోని వెంకటేశ్వరపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. స్థానిక నాయకుడు వెంగళ్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమాభివృద్ధిని వివరించే కరపత్రాలు అందజేశారు. నగరాభివృద్ధికి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. స్థానిక నాయకులు విజయ్, వెంకట రమణమ్మ, శిరీషా, కళ్యాణ్, మనోహర్, శివ, తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళాకారులను ఆదరించాలి

నెల్లూరు(బృందావనం): కళారంగానికి తమ జీవితాన్ని త్యాగం చేసిన కళాకారులను సమాజం ఆదరించి ప్రోత్సహించాలని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఉగాది పండగ సందర్భంగా నాలుగు దశాబ్దాలకు పైగా కళామతల్లికి విశిష్ట సేవలందించిన నగరానికి చెందిన సీనియర్ కళాకారుడు అక్కం లక్ష్మీపతిని నర్తకీసెంటర్‌లో బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. వివిధ రంగాలు, సంఘాలు, సంస్థలకు చెందిన నిర్వాహకులు ఏ జయప్రకాష్, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, అరవ రామమోహన్‌రావు,



లక్ష్మీపతికి సత్కారం

శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, శ్రీమన్నారాయణ, మహేష్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రంజాన్ పండగను పురస్కరించుకుని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించి ఈద్-ఉల్-ఫిత్రు జరుపుకొంటున్న ముస్లింలందరికీ అల్లాహ్ దయ ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అల్లాహ్ దయతో మళ్లీ సీఎంగా ఎన్నిక కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

పండగను ఆనందంగా జరుపుకోవాలి



ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(బృందావనం): రంజాన్ పండగను పురస్కరించుకుని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండగను ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అల్లా ఆశీస్సులతో ప్రతి ముస్లిం కుటుంబం అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈద్ ముబారక్



నెల్లూరు(బారకాసు): రంజాన్ పండగ సందర్భంగా ముస్లింలకు కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరించిన ప్రార్థనలు సఫలం కావాలని, అల్లా దీవెనలతో ప్రతి ముస్లిం కుటుంబానికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ పండగను ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ హైమారావు బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు సిటీ: ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని గీతామయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. అపోలో ఆస్పత్రి సమీపంలోని శ్రీనివాస్ నివాసంలో జరిగిన జన్మదిన వేడుకల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గునపాటి రమేష్‌రెడ్డి, ఎంబేటి ఏసునాయుడు, సీహెచ్ హరిబాబుయాదవ్, వేలూరు శ్రీధర్‌రెడ్డి, వేలూరు శివ సునీల్‌రెడ్డి, ముడియాల రామిరెడ్డి, కొండేటి శివారెడ్డి, యాకసిరి శరత్‌చంద్ర, తాళ్లూరు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పొదలకూరు : మండలంలోని ఆర్‌వైపాళెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని పట్టుకున్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై హెచ్చరించారు.

12 బాటిళ్ల పట్టివేత

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సర్వేపల్లిలోని మద్యం షాపు నుంచి ఈదగాలి గ్రామానికి చెందిన పోలయ్య అనే వ్యక్తి 12 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రూ.3.31 లక్షల నగదు స్వాధీనం

వెంకటాచలం : ఎన్నికల నేపథ్యంలో వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలోని చెక్‌పోస్టు వద్ద రూ.3.31 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకులో నగదును జమ చేసేందుకు టోల్‌ప్లాజా సిబ్బంది వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. సిబ్బంది వద్ద ఉన్న రూ.3.31 లక్షలకు సంబంధించిన బిల్లులు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.



నెలవంక దర్శనంతో బాణసంచా కాల్చుతున్న ముస్లిం యువత

ఈద్ ముబారక్

వినీలాకాశంలో నెలవంక దర్శనమిచ్చింది. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలను ఆచరించిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం విరమించారు. ఈద్-ఉల్-ఫిత్ర్‌ను గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. బుధవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో ముస్లిం యువత బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

\- సాక్షి, ఫొటోగ్రాఫర్



కేరింతలు కొడుతున్న చిన్నారులు

రంజాన్ ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని అన్ని ఈద్గాల వద్ద రంజాన్ ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. నగరంలోని బారాషహీద్ దర్గా, పాతచెక్‌పోస్ట్, వెంకటేశ్వరపురం, ఈద్గామిట్ట, నజీర్‌తోట ఈద్గాలను శానిటేషన్ అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ఈద్గాలో నిర్వహించే సామూహిక ప్రార్థనలకు హాజరయ్యే ముస్లింల కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్ని వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఈద్గాలకు వచ్చే ముస్లింలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక బృందాలను నియమించి నీడ, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర వసతులను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం 9వ డివిజన్ బంగ్లాతోటలో జరుగుతున్న డ్రైనేజీల్లో పూడికతీత పనులను పరిశీలించారు.



బారాషహీద్ దర్గా ఈద్గాలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికులకు అండగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముత్యంగౌడ్ తెలిపారు. మాగుంట లేఅవుట్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ బలంగా ఉందన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో అన్ని విభాగాల్లోని కార్మికులు లబ్ధి పొందారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు కార్మికులపై అనుసరించిన దుశ్చర్యలను వారు ఎప్పటికీ మరువరన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు హైదరాబాద్‌లో ధర్నా చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలపై వాటర్ గన్నులు, గుర్రాలతో దాడి చేయించిన ఘటన, అసంఘటిత కార్మికులపై బషీర్‌భాగ్‌లో కాల్పులు జరిపించడం నేటికి మరిచిపోలేని ఘటనలు అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు అసంఘటిత కార్మికులు తగిన బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డితో పాటు 8 అసెంబ్లీ స్థానాలకు చెందిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు క్షేత్రస్థాయిలో అన్ని ట్రేడ్ యూనియన్ విభాగాలతో కలిపి ఐకమత్యంగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రసాద్‌రెడ్డి, రాము, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు

పులి వాహనంపై సంగమేశ్వరుడు

సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి స్వామి అమ్మవార్లకు పులి వాహన సేవ ఘనంగా జరిగింది. అర్చకులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పులి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి, అర్చకులు రఘుస్వామి, నాగేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.